క్లుప్తంగా

'మై డియర్ దొంగ' చిత్ర బృందం సందడి



పెదకాకాని: అభినవ్ గోమఠం, షాలినీ, దివ్య శ్రీపాద ప్రధానపాత్రల్లో సర్వజ్ఞకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న కామెడీ ఎంటర్‌టైనర్ మై డియర్ దొంగ చిత్ర యూనిట్ సందడి చేసింది. ఈ చిత్రం ఏప్రిల్ 19న ఆహా ఓటీటీలో విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం సోమవారం మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలను సందర్శించింది. ఈ సందర్భంగా చిత్ర హీరో అభినవ్ గోమఠం మాట్లాడుతూ చిత్రం ఆద్యంతం హాస్య ప్రధానంగా సాగుతుందన్నారు. ఇటీవల విడుదలైన చిత్ర టీజర్‌కు విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందన్నారు. అనంతరం చిత్ర బృందం సభ్యులు విద్యార్థులతో కలసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

వలంటీర్ల సామూహిక రాజీనామాలు



గుంటూరు రూరల్: వలంటీర్ల సామూహిక రాజీనామాల పర్వం మండలవ్యాప్తంగా కొనసాగుతూనే ఉంది. సోమవారం మండలంలోని చల్లావారిపాలెం గ్రామంలో 19 మంది వలంటీర్లకు గాను 18 మంది స్వచ్ఛందంగా రాజీనామాలను చేశారు. అదేవిధంగా ఓబులునాయుడుపాలెం గ్రామంలో 10 మందికి పది మంది రాజీనామాలను గ్రామ కార్యదర్శికి అందజేశారు. అదేవిధంగా తురకపాలెం గ్రామంలో 12 మందికి 9 మంది మూకుమ్మడి రాజీనామాలను స్థానిక కార్యదర్శికి అందజేశారు.

ఫ్యానుకు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



కన్నయ్య మృతదేహం

గుంటూరు రూరల్: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జూనంచుండూరు గ్రామానికి చెందిన సాదరబోయిన కన్నయ్య(38) మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో పొలం కౌలుకు తీసుకుని సాగు చేశాడు. పంట సక్రమంగా పండకపోవటంతో దిగుబడి తగ్గింది. దీంతో నష్టం వాటిల్లింది. అప్పులు పెరిగి పోవటంతో తీవ్ర మనస్తాపానికి గురైన కన్నయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించటంతో సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుని భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రజా చైతన్యంతోనే అగ్ని ప్రమాదాల నివారణ



పొన్నూరు: ప్రజలు చైతన్యవంతంగా ఉండి అగ్ని ప్రమాదాలను నివారించాలని పొన్నూరు అగ్నిమాపక కేంద్ర అధికారి కె.ప్రసాదరావు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్, ఆర్టీసీ బస్ డిపోలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు వ్యాపించిన మంటలను ఎలా అదుపు చేయాలి? వెంటనే చేపట్టాల్సిన చర్యలను అగ్నిమాపక సిబ్బంది చేసి చూపించారు. అగ్ని ప్రమాదాల నివారణకు చేయాల్సిన చర్యలపై ప్రచురించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్ని మాపక కేంద్ర సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కవితల పోటీలు

ఫిరంగిపురం: రాష్ట్రస్థాయి కవితల పోటీలకు కవితలను ఆహ్వానిస్తున్నట్లు కొండవీడు రచయితల సంఘం అధ్యక్షుడు మహ్మద్ రఫీ, కార్యదర్శి తొళ్లమడుగు గోవిందయ్య సంయుక్తంగా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపోటీలకు కవితలు పంపదల్చుకున్నవారు చక్కని పదాలతో 20 లైన్లకు మించకుండా, పొడుగు వాక్యాలు రాయకుండా ఉండాలని చెప్పారు. వాటితోపాటు హామీ పత్రం, పాస్‌పోర్టు ఫొటో, కవితను మూడు కాపీలుగా చేసి మే 15వ తేదీలోపు టి.గోవిందయ్య, కొత్తపేట, 14-198, ఫిరంగిపురం (పోస్టు), గుంటూరు జిల్లా చిరునామాకు పంపవచ్చని చెప్పారు. వివరాలకు 99663 85583 నెంబరులో సంప్రదించాలన్నారు. ప్రథమ బహుమతి రూ.2వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1500, తృతీయ బహుమతి రూ.వెయ్యి నగదు అందజేస్తామన్నారు.

సంక్షేమాభివృద్ధే జగనన్న ధ్యేయం

- వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- చేబ్రోలులో మూడో రోజు ఎన్నికల ప్రచారం



గొల్లపాలెంలో జరిగిన సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ



పాత రెడ్డిపాలెంలో దోసెలు వేస్తున్న అంబటి మురళీకృష్ణ



పాతరెడ్డిపాలెంలో ప్రచార రథం నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న అంబటి మురళీకృష్ణ



ఎండు చేపల దుకాణంలో అంబటి సందడి

చేబ్రోలు: సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో మూడో రోజు సోమవారం పాతరెడ్డిపాలెం పరిసర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. యడ్లపాటి నగర్, చెరువులోపాలెం, చీలిపాలెం, జోసఫ్‌నగర్, ఉప్పరపాలెం, బండపాలెం, నరాలశెట్టిపాలెం, పాత దళితవాడ ప్రాంతాల్లో రోడ్ షో, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చేబ్రోలు పాత పోలీసు స్టేషన్ రోడ్డులోని గొల్లపాలెం వద్ద సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. పొన్నూరు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వివిధ పథకాల ద్వారా రూ.2,60లక్షల కోట్లు మహిళల ఖాతాలో జమచేశారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల వద్ద సంక్షేమ పథకాలను తీసుకువచ్చినట్లు తెలిపారు.

అంబటి ప్రత్యేక పూజలు..

పెదకాకాని: పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామంలో కోదండ రామాలయం జీర్ణోద్ధరణ పూర్వ పునఃప్రతిష్ఠ మహాకుంభాభిషేక మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకస్వాములు పూజా క్రతువు శాస్త్రోక్తంగా జరిపించారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పాల్గొని పూజలు చేశారు. అర్చకులు అంబటి మురళీకృష్ణ పేరిట గోత్రనామ పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో అంబటి మురళీకృష్ణతో పాటు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, కొప్పురావూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ తోట శ్రీనివాసరావు, వలువురు గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం అన్నసంతర్పణ జరిగింది.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



తెనాలిరూరల్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆందోళనకు గురికాకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలని తెనాలి జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి కె.కృష్ణారెడ్డి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాల నివారణపై తెనాలి ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వైరింగ్‌లో లోపాలు, చుట్ట, బీడీ, సిగరెట్ వంటివి కాల్చి అజాగ్రత్తగా పడేయడం, గ్యాస్ లీకవడం వంటి కారణాలతో ఎక్కువ శాతం ప్రమాదాలు సంభవిస్తాయని చెప్పారు. ఇళ్లలో వైరింగ్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారమందించాలని సూచించారు. అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

కోరిన కోరికలు తీర్చే కాశీవిశ్వేశ్వరుడు

- ఘనంగా స్వామివారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం
- ప్రత్యేక పూజలు చేసిన కిలారి రోశయ్య, బలసాని



కాశీ విశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య

గుంటూరు రూరల్: భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవుడు కాశీ విశ్వేశ్వరుడని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్‌లు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గోర్లవారిపాలెం గ్రామంలో కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ముఖ్యఅతిథులకు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాట్లాడుతూ స్వామి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు, పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అభయ సీతారామాంజనేయ స్వామికి పూజలు..

అర్బన్ మండలం 41వ డివిజన్ స్వర్ణభారతినగర్ ఈ బ్లాక్ 4వ లైనులో నూతనంగా నిర్మించిన అభయ సీతారామాంజనేయస్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో బలసాని కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. స్వామి దయతో ప్రజలంతా సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఆలయం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అభ్యర్థికి సాదర స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జనమంతా జగనన్నవెంటే..

- జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు
- కండువాలు కప్పి ఆహ్వానించిన వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: జగనన్న సంక్షేమం, అభివృద్ధిని మెచ్చి ప్రతిఒక్కరూ వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో కాపు సోదరుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బలసాని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, జనరంజకమైన పాలనను ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. మరోసారి ఆయనే ముఖ్యమంత్రిగా కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని జనసేన నేతలు రామిశెట్టి రాఘవయ్య, తవిటి అశోక్, యర్రంశెట్టి దుర్గారావు, రామిశెట్టి నాగభూషణం, ఇపూరి సాంబశివరావు, రామిశెట్టి కోటేశ్వరరావు, యర్రంశెట్టి ఎల్లయ్య, ఈపూరి తిరుపతయ్య, ఈపూరి రామారావు, ఈపూరి శ్రీనివాసరావు, ఈపూరి మోహన్‌రావు, రామిశెట్టి బాబురావు, రామిశెట్టి నాగార్జున, ఈపూరి వెంకటేష్ తదితరులు సుమారు 500 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిని ఎమ్మెల్యే అభ్యర్థి పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. జగనన్న ద్వారానే ప్రజలు సంతోషంగా జీవిస్తారని ప్రజలు నమ్ముతున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి తెలిపారు. రానున్న కాలంలో మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు తామంతా సిద్ధంగా ఉండాలని ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, గుంటూరు మిర్చి యార్డు డైరెక్టర్ బొందలపాటి వెంకటేశ్వర్లు (ఇంద్ర), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రాస్తారోకో

> ప్రభుత్వం సాగర్ జలాలు విడుదల చేసినా అధికారుల నిర్లక్ష్యంతో చెరువులు నిండని వైనం

ప్రత్తిపాడు: తాగునీటి కోసం గ్రామస్తులు ఆందోళన బాట పట్టారు. దేవుడు కరుణించినా పూజారి వరమివ్వని చందంగా.. ప్రభుత్వం సాగర్ జలాలు విడుదల చేసినా, కేవలం అధికారుల పర్యవేక్షణా లోపంతో చెరువుల వరకు నీరు రావడం లేదంటూ రోడ్డుపై బైఠాయించి నాలుగు గంటల పాటు మండుటెండలో రాస్తారోకో చేశారు. వివరాల్లోకి వెళితే ప్రభుత్వం మంచినీటి చెరువులు నింపేందుకు సాగర్ జలాలను విడుదల చేసింది. టెయిలెండ్‌లో ఉన్న ప్రత్తిపాడు చెరువుకు వంకాయలపాడు మేజర్ ద్వారా నీరు రావలసి ఉంది. నీరు సజావుగా చివరి చెరువుల వరకు రావాలంటే అధికారులు కాలువ పొడవునా గస్తీ ఉంటూ, నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో గ్రామస్తులే బృందాలుగా ఏర్పడి కాలువపై గస్తీ ఉంటూ నీటిని ప్రత్తిపాడు చెరువుకు తెచ్చుకునే ప్రయత్నాలు చేశారు. అయితే మార్గమధ్యంలో ఉన్న గ్రామాల వారు నీటిని దారి మళ్లించి వారి చెరువులకు నింపుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి కొందరు వ్యక్తులు లాకులు సైతం పగలగొట్టి విధ్వంసానికి పాల్పడ్డారు. దీంతో ప్రత్తిపాడు చెరువు వరకు వచ్చే నీరు అర్ధంతరంగా ఆగిపోయింది. ఇదే విషయమై స్థానికులు, నాయకులు ఎన్ఎస్‌పీ కెనాల్స్ జేఈఈ ఆంజనేయులు దృష్టికి పలు మార్లు తీసుకువెళ్లినప్పటికీ ఆయన నుంచి ఎటువంటి స్పందనా కనిపించలేదు. దీంతో ఏమి చేయాలో పాలుపోక ప్రత్తిపాడు గ్రామస్తులు సోమవారం ఉదయం ఆందోళన చేపట్టారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ప్రత్తిపాడులోని గుంటూరు-పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ కె.దుర్గాప్రసాద్, ఎస్ఐ సోమేశ్వరరావులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన విరమించాలని ప్రజలను, నాయకులను కోరారు. అనంతరం ఎన్ఎస్‌పి కెనాల్స్ ఈఈ మురళీధర్ ప్రత్తిపాడుకు వచ్చి గ్రామస్తులతో మాట్లాడారు. వారు స్థానికంగా అధికారుల లోపాలను ఆయనకు వివరించారు. స్వయంగా తాను కూడా కాలువపైకి వెళ్లి కచ్చితంగా 48 గంటల్లో ప్రత్తిపాడు చెరువుకు నీళ్లు వచ్చేలా చర్యలు తీసుకుంటానని, ప్రత్తిపాడు చెరువులు సమృద్ధిగా నిండే వరకూ నీటిని అందిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

నవ సమాజ నిర్మాణానికి ఓటు ఆయుధం



ప్రదర్శనలో పాల్గొన్న తహసీల్దార్ శ్రీనివాసులు, శేషన్న

తెనాలిఅర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందని దానిని గుర్తెరిగి ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును రానున్న ఎన్నికల్లో వినియోగించుకోవాలని కొల్లిపర తహసీల్దార్ ఎస్.శ్రీనివాసులు సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 'స్వీప్' కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో గుప్తా డిగ్రీ కళాశాలలో ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఉద్యోగులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. అందరూ ఓటు వినియోగించుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు ద్వారా మంచి పాలకులను ఎన్నుకోవాలని సూచించారు. అందరూ స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు పెట్టే ప్రలోభాలకు లోనూ కాకుండా ఓటు వేయాలన్నారు. అనంతరం ఓటు వేస్తామనే ప్రతిజ్ఞను హాజరైన వారితో చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, గుప్తా డిగ్రీ కళాశాల నిర్వాహకులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చు

> డాక్టర్ కొమ్మారెడ్డి శంకర్‌రెడ్డి



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కొమ్మారెడ్డి శంకర్‌రెడ్డి

లక్ష్మీపురం: క్రమబద్ధమైన ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ మధుమేహ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చు అని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కొమ్మారెడ్డి శంకర్ రెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అధ్యక్షతన ఆరోగ్యంపై అవగాహన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ షుగర్ వ్యాధి రావడానికి ప్రధాన కారణం అధిక బరువు, శారీరక శ్రమ తక్కువగా ఉండటం మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉండటం నిద్రలేమి కారణాలన్నారు. ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకుంటూ మంచి అలవాట్లతో జీవనశైలిని పాటిస్తూ డయాబెటిస్ ముప్పుని ఎదుర్కోవచ్చన్నారు. ఆకుకూరలు ఎక్కువగా తినటం, జంక్ ఫుడ్‌కి నో చెప్పటం, వ్యాయామం చేయటంతో పాటు అందుబాటులో ఉన్న నివారణ మార్గాల ద్వారా షుగర్ వ్యాధికి చెక్ పెట్టవచ్చన్నారు. డాక్టర్ శంకర్ రెడ్డిని సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి సంస్థ సభ్యులు టి.వి.సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించగా, విద్యాధర కుమార్ పాల్గొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభంపై చర్చా గోష్టి నిర్వహించారు. విశ్లేషకులు, ప్రిన్సిపల్ రవిబాబు మాట్లాడారు. విద్యావేత్త టి.నారపరెడ్డి, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్: నేడు తాడేపల్లి పట్టణ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఉదయం 6.30 గంటల నుంచి ఉదయం 7.30 గంటలకు వరకు తాడేపల్లి, కుంచనపల్లి, పాతూరు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి

తూర్పు ఈఆర్ఓ కీర్తి చేకూరి



నెహ్రూ నగర్: ఎన్నికల విధులపై అందిస్తున్న శిక్షణను శ్రద్ధగా అవగాహన చేసుకుంటే పోలింగ్ సాఫీగా నిర్వహించడానికి వీలు కలుగుతుందని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఈఆర్ఓ) కీర్తి చేకూరి తెలిపారు. 2024 సాధారణ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధులు కేటాయించబడిన పీఓలు, ఏపీఓలకు సోమవారం స్థానిక ఏసీ కళాశాలలో నిర్వహిస్తున్న తొలివిడత శిక్షణను ఆమె పరిశీలించారు. శిక్షణలో వీడియో క్లిప్పింగ్స్, డెమో ఈవీఎంలపై ఈవీఎంలు, వీవీ ప్యాట్ కమిషనింగ్, మాక్ పోల్, ఫారం-17సీ, పీఓ డైరీ, ఇతర ఫారాలు నింపడం వంటి కీలక అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల విధులు కేటాయించబడిన ఉద్యోగుల నుంచి పోస్టల్ బ్యాలెట్‌కి సంబంధించి ఫారం-12ని సిబ్బందికి అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ఓలు సునీల్, భీమరాజు, ఏఈఆర్ఓ వెంకటలక్ష్మి, డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ అయుబ్ ఖాన్, ఏఈ సునీల్ కుమార్, మేనేజర్ ఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన అవసరం

నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గంగరాజు

తాడికొండ: ఎన్నికల నిర్వహణలో సంబంధిత అధికారులకు సమయపాలన పాటించడం, పూర్తి అవగాహన కలిగి ఉండటం తప్పనిసరి అని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు సూచించారు. సోమవారం లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ప్రజలందరూ తమ ఓటు హక్కును ప్రశాంతంగా త్వరితగతిన వినియోగించుకునేందుకు సిబ్బంది పనితీరు ప్రధానమన్నారు. అందుకోసం వారికి సరైన అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన శిక్షణా సమావేశాన్ని ఉపయోగించుకొని ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలన్నారు. అనంతరం ఏడుగురు మాస్టర్ ట్రైనీలచే 290 మంది పీఓలు, ఏపీఓలకు శిక్షణ అందజేశారు. నాలుగు మండలాల తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

కంతేరులో రూ.1.30 లక్షల నగదు స్వాధీనం

తాడికొండ: తాడికొండ మండలం కంతేరు గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రూ.1.30 లక్షల నగదును పట్టుకున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. కంతేరు శ్రీ సిటీ వెంచర్ వద్ద ఫ్లెయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తుండగా మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన పత్తిపాటి వీరయ్య అనే వ్యక్తి కారులో రూ.1.30 లక్షల నగదును తీసుకొని వెళుతుండగా తనిఖీలలో పట్టుబడ్డాడు. అందుకు సంబంధించిన రశీదులు చూపించనందున ఐటీ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.